సాక్షి ప్రకాశం

సోమవారం । 19 । ఆగస్టు । 2024



కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తా

కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తాపడి ఐదుగురికి తీవ్ర గాయాలు, పది మందికి స్వల్ప గాయాలైన ఘటన దర్శి మండలంలో ఆదివారం జరిగింది.

- 8లో..



నల్లమల రోడ్డులో ట్రాఫిక్ జామ్

ఓ లోడు లారీ మరమ్మతులకు గురై రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో నల్లమలలోని కర్నూలు-గుంటూరు రహదారిలో ట్రాఫిక్ జామ్ అయింది.

- 8లో..

గరిష్టం/కనిష్టం
37/29

వాతావరణం

ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

సబ్ కలెక్టర్ బదిలీ



సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా

మార్కాపురం టౌన్: మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన గతేడాది డిసెంబరు 22న మార్కాపురం సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. నూతన సబ్‌కలెక్టర్‌గా ప్రభుత్వం ఎవరినీ నియమించలేదు.

ఘనంగా నాగభైరవ పురస్కార ప్రదానోత్సవం



పురస్కార గ్రహీతలతో పీఠం సభ్యులు

ఒంగోల మెట్రో: డాక్టర్ నాగభైరవ కోటేశ్వర రావు పేరుతో నాగభైరవ సాహిత్య పీఠం పురస్కారాలు ఆదివారం ప్రదానం చేశారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం ఉదయం డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ అధ్యక్షతన పురస్కార ప్రదానోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రజానాట్య మండలి నాయకులు నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏటా క్రమం తప్పకుండా నాగభైరవ కోటేశ్వరరావు పేరిట పురస్కారాలు ప్రదానం చేయడం సముచితంగా ఉందన్నారు. కృష్ణా జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, కళామిత్ర మండలి అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు మాట్లాడుతూ నాగభైరవ కవిత్వమే ఊపిరిగా బతికారన్నారు. పద్యాన్ని, గద్యాన్ని సమపాళ్లలో రంగరించి రచనలు చేసిన గొప్ప సాహితీవేత్త అని కొనియాడారు. రచయితలు తేళ్ల అరుణ, కుర్రా ప్రసాద్ బాబు నాగభైరవతో తమ పరిచయాన్ని వివరించారు. 'పూలపూల వాన' పుస్తక రచయిత ఏనుగు నరసింహారెడ్డికి ప్రథమ బహుమతి రూ.10 వేల నగదు పురస్కారం, 'మణిపూసలు' రచయిత డాక్టర్ వూటుకూరి వరప్రసాద్‌కు ద్వితీయ బహుమతి రూ.5 వేలను అందజేశారు. డాక్టర్ బీరం సుందరరావు సాహిత్య పురస్కార గ్రంథ సమీక్ష చేశారు. అనంతరం నాగభైరవ కళా పురస్కారం కింద పురస్కార గ్రహీత, సినీ నాటక రచయిత, నటుడు, దర్శకుడు వై.కృష్ణేశ్వర రావుకు రూ.10 వేలను డాక్టర్ కందిమళ్ల, చుండి బేబి సుజాత అందజేశారు. నాగభైరవ ఆత్మీయ పురస్కారాన్ని డాక్టర్ బీరం సుందరరావుకు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ కవులు డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, నవ్యాంధ్ర రచయితల సంఘ ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, కె.బాలకోటయ్య, వి.ఝాన్సీదుర్గ, బీరం అరుణ, బెజవాడ వెంకట్రావు, డా.సంతవేలూరి కోటేశ్వరరావు, మిడసల మల్లికార్జున రావు, కేవీస్వీ ప్రసాద్, పోతినేని వెంకటేశ్వర్లు, బెజవాడ రామారావు, డాక్టర్ నాగభైరవ ఆంజనేయులు పాల్గొన్నారు.

నేడు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ బడ్జెట్‌పై సదస్సు

ఒంగోలు: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ బడ్జెట్‌పై పౌర సమాజ ప్రతినిధుల జిల్లా సదస్సు సోమవారం స్థానిక మల్లయ్య లింగం భవన్‌లో నిర్వహిస్తున్నట్లు డీబీఆర్సీ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సదస్సు ఉంటుందన్నారు.

కూటమి ప్రభుత్వం తాజాగా తీసుకొచ్చిన మార్గదర్శకాలు ఇళ్లులేని పేద, మధ్య తరగతి వర్గాలకు శాపంగా మారాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన గృహాలపై ప్రస్తుత ప్రభుత్వం వివక్ష చూపుతోంది. గతంలో మంజూరై పెండింగ్‌లో ఉన్న వాటికి బిల్లులు చెల్లించకుండా కుట్ర పన్నుతోంది. గృహ నిర్మాణాలకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0ను లింక్ చేయడం ద్వారా ఇప్పటికే లబ్ధిదారులుగా ఉన్నవారిపై కక్షసాధింపులకు తెరతీస్తోంది.



మధ్యలోనే నిలిచిపోయిన ఇల్లు

పేదల గూడుపై పచ్చకుట్ర

- ఇళ్ల నిర్మాణానికి పీఎంఏవైకి 2.0 తో లింక్
- కొత్త నిబంధనలతో పాత లబ్ధిదారులపై కుట్రలు
- పాత బిల్లు బకాయిలపై కొరవడిన స్పష్టత
- పెండింగ్‌లో ఉన్న ఇళ్ల లబ్ధిదారులకు మొండిచేయి
- కొత్తగా మంజూరయ్యే లబ్ధిదారులకు మాత్రమే రూ.4 లక్షలు

ఒంగోలు సిటీ:

ఇళ్లు లేని ప్రతి పేదకు సొంతిల్లు కట్టించాలన్న లక్ష్యంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు చేపడితే అందుకు భిన్నంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం పెద్దలు వ్యవహరిస్తున్నారు. జగనన్న కాలనీల పేరుతో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త ఊళ్లను నిర్మించింది. చాలా ప్రాంతాల్లో టీడీపీ నాయకులు న్యాయపరమైన అడ్డంకులు సృష్టించారు. వాటన్నింటినీ అధిగమిస్తూ ఇళ్ల నిర్మాణాలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా 63,279 గృహాలు మంజూరవగా అందులో 21,245 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇంకా 23,993 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. అలాగే ప్రధాన మంత్రి అవాస్ యోజన పథకం (పీఎంఏవై) ద్వారా జిల్లాలో 7,668 మంది లబ్ధిదారులకు గృహాలు మంజూరయ్యాయి. అందులో 1100 నిర్మాణాలు పూర్తి కాగా, 1913 నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. గతంలో పీఎంఏవై కింద ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు రూ.1.50 లక్షల నిధులు, రూ.30 వేలు ఉపాధిహామీ పథకంలో అనుసంధానం, రూ.50 వేలు బ్యాంకు ద్వారా రుణం మొత్తంగా రూ.2.30 లక్షలు వర్తించేది. తాజాగా ఇచ్చిన ఉత్తర్వుల్లో ఆ మొత్తం రూ.4 లక్షలకు పెంచారు. కొత్తగా మంజూరయ్యే లబ్ధిదారులకు రూ.4 లక్షలు వర్తించేలా ఉత్వర్వులు ఇవ్వడంతో గతంలో మంజూరై నిర్మాణాలు పూర్తి కాని లబ్ధిదారులు లబోదిబోమంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొత్త నిబంధనలతో కక్షసాధింపు:

పేదల గృహాలపై కూటమి ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. రాష్ట్రంలో పేదల కోసం చేపడుతున్న గృహ నిర్మాణ పథకానికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0కి అనుసంధానం చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇక్కడే పాత లబ్ధిదారులపై కక్షసాధించేలా కుట్రలకు తెరతీసింది. పీఎంజీఏవై 2.0 నిబంధనల ప్రకారం ఇంటి కోసం ఎంపికైన లబ్ధిదారులకు రూ.4 లక్షలు ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో రాష్ట్రం వాటా 40 శాతం, కేంద్రం వాటా 60 శాతం. గతంలో కంటే లబ్ధిదారునికి

పీఎంఏవై కింద చేపట్టిన గృహ నిర్మాణాలు	
మంజూరైన గృహాలు 7,668	పూర్తి అయినవి 1,100
వేర్వేరు దశల్లో: 1,913	



వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు

ఇస్తున్న మొత్తం కంటే ఇది ఎక్కువ కదా అని అనుకుంటే పప్పులో కాలేసినట్టే. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా తీసుకొచ్చిన ఈ నిబంధన కొత్త లబ్ధిదారులకు మాత్రమే వర్తిస్తుంది. ఈ నిర్ణయంతో ఇప్పటికే ఇళ్ల నిర్మాణం చేపడుతోన్న లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన ఇళ్లపై ఇంత కక్షసాధింపు చర్యలకు పాల్పడడం సరికాదని వాపోతున్నారు. ఇదేమి న్యాయం.. ఆర్థిక స్థోమత లేకపోవడంతోనే ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదని, మాకూ కొత్త నిబంధనలు వర్తింపచేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ప్రభుత్వం ఏదైనా ఇలా పక్షపాత ధోరణి అవలంబించడం ఎంత వరకు సబబని ప్రశ్నిస్తున్నారు. కొత్త నిబంధనలతో ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్న 23,993 లబ్ధిదారుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. పెండింగ్‌లో ఉన్న బిల్లులు వస్తాయా? రావా? అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పేదలను ప్రభుత్వం ఆదుకోవాలి



మాకు మంజూరైన ఇల్లు ఆర్థిక స్థోమత లేక పునాదుల దశలో ఆగిపోయింది. నిర్మాణం జరుగుతున్న ప్రతి ఇంటికి రూ.4 లక్షలు వర్తింపజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుని పేదలను ఆదుకోవాలి.

– గద్దల అనూష, క్రిస్టియన్‌పేట, కరవది

జిల్లాలో చేపట్టిన గృహ నిర్మాణాలు ఇలా.

మంజూరైన గృహాలు	63,279
పూర్తయినవి	21245
బీబీఎల్	10,767
బేస్‌మెంట్ లెవల్	7,714
లెంటల్ లెవల్	702
రూఫ్ లెవల్	1,962
ఆర్‌సీ లెవల్	2,848
నిర్మాణాలు ప్రారంభించనివి	18,041

న్యాయం జరిగేంత వరకు పోరాటం

- మూడో రోజు కూడా కొనసాగిన జూనియర్ డాక్టర్ల నిరసనలు
- నల్లబెలూన్లు ఎగరేసి జూడాల నిరసన

ఒంగోలు టౌన్: కోల్‌కత్తాలోని కార్ ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచారానికి నిరసనగా జూనియర్ డాక్టర్లు చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారం మూడో రోజుకు చేరాయి. ప్రభుత్వ కళాశాల నుంచి ఉదయం 9 గంటలకు ర్యాలీగా బయలు దేరి జీజీహెచ్ ఆవరణలోని దీక్షా శిబిరానికి చేరుకున్న జూనియర్ డాక్టర్లు సాయంత్రం 7 గంటల వరకు తమ నిరసనలను కొనసాగించారు. మాకు న్యాయం కావాలి, న్యాయం చేసేంత వరకు పోరాటం కొనసాగిస్తాం అంటూ నినాదాలు చేశారు. న్యాయపోరాటానికి దిగిన జూనియర్ డాక్టర్లు విధులను బహిష్కరించడంతో పలువురు రోగులు ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వైద్య సేవలకు ఆటంకం ఏర్పడింది. జూనియర్ వైద్యుల పోరాటానికి క్రమంగా మద్దతు పెరుగుతోంది. దీక్షా శిబిరాన్ని సందర్శించిన ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) నాయకులు జూడాలకు మద్దతు ప్రకటించారు. ఇది కేవలం వైద్య విద్యార్థినిపై జరిగిన దారుణం మాత్రమే కాదని, మొత్తం మహిళలపై జరుగుతున్న అకృత్యాలలో భాగంగా జరిగిన ఘోరమని, ఈ పోరాటానికి ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రసిడెంట్ డా.అజయ్ కుమార్ రెడ్డి కోరారు. నిరసన కార్యక్రమంలో జూడా నాయకులు బి.శృతి, విష్ణుప్రియ, అవినాష్, చైతన్య సాయి, పవిత్ర, రాము, హర్షిత, శివ రామ కృష్ణ, నాగేంద్ర, సత్యసాయి, చరణ్, మాధవి తదితరులు నాయకత్వం వహించారు. సాయంత్రం నల్ల బెలూన్లు గాలిలోకి వదిలి నిరసన తెలిపారు.



నల్లబెలూన్లు ఎగరేసి నిరసన తెలిపిన జూడాలు

జూనియర్ డాక్టర్‌పై దుర్మార్గానికి ప్రభుత్వాలు బాధ్యత వహించాలి

■ పీడీఎస్‌యూ, ప్రగతి శీల మహిళా సంఘం

ఒంగోలు టౌన్: కోల్‌కత్తా ప్రభుత్వ వైద్యశాలలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన లైంగికదాడి, హత్యకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పద్మ డిమాండ్ చేశారు. ఏకంగా ప్రభుత్వ వైద్య కళాశాలలోనే హత్యాచారం జరగడం దేశంలో మహిళల మీద పెరిగిన దాడులకు నిదర్శనమని, ఈ దాడులను నియంత్రించడంలో కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని విమర్శించారు. నగరంలోని కలెక్టరేట్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పీడీఎస్‌యూ, పీఓడబ్ల్యూల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వాలు కళ్లు తెరచి మహిళల రక్షణ కోసం కఠినమైన చట్టాలు తీసుకొని రావాలని కోరారు. జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం జరిగి వారం రోజులైనప్పటికీ నిందితులను అరెస్టు చేయకపోవడం దారుణమని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ మండిపడ్డారు. ర్యాలీలో ఝాన్సీ, మంజులు, మహేశ్వరి, చిట్టిపాటి పద్మ, అమ్మాజీ, అరుణ, జూనియర్ డాక్టర్లు సాహితి బాను, శ్రావణి, పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

ఇక బదిలీల జాతర

- 15 శాఖల్లో బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- ఆయా శాఖల్లో జిల్లాలో సుమారు 12 వేల మంది అధికారులు, ఉద్యోగులు

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ శాఖల్లో 15 శాఖలకు సంబంధించి బదిలీలు నిర్వహించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లాలో బదిలీ ప్రక్రియ ప్రారంభమైంది. గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన శాఖల్లో రెవెన్యూ (ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్), పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్, గ్రామ, వార్డు సచివాయాలు, సివిల్ సప్లయిస్, మైనింగ్ అండ్ జియాలజీ, అన్నీ శాఖల్లో ఇంజినీరింగ్ సిబ్బంది, ఎండోమెంట్స్, రవాణా, ఈఎఫ్ఎస్ అండ్‌టీ, పరిశ్రమలు, ఎనర్జీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, కమర్షియల్ టాక్స్, ఎక్సైజ్ శాఖల్లో బదిలీ ప్రక్రియ చేసుకోవచ్చని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. జిల్లాలో బదిలీకి అవకాశం ఇచ్చిన 15 శాఖల్లో సుమారు 12 వేల మంది అధికారులు, ఉద్యోగులు ఉన్నారు. ఒక్క గ్రామ, వార్డు సచివాలయాల్లోనే 7 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. రెవెన్యూ శాఖలో జిల్లా వ్యాప్తంగా దాదాపు వెయ్యి మందికి పైగా ఉండగా మిగిలిన శాఖల్లో మరో 5 వేల మంది ఉన్నారు. అయితే బదిలీలు ఐదు సంవత్సరాలు పూర్తయిన అధికారులు, ఉద్యోగులకు ఉండటంతో బదిలీల్లో చాలా తక్కువ మంది మాత్రమే అధికారులు, ఉద్యోగులు ఉంటారనే అభిప్రాయం ఉద్యోగ సంఘాల నుంచి వ్యక్తమవుతోంది. కూటమి నాయకులకు అనుకూలంగా ఉండే వారిని నియమించుకునేందుకు పరిపాలన సౌలభ్యాన్ని వినియోగించుకునే అవకాశం ఉంది. బదిలీ అయ్యే అధికారులు, ఉద్యోగులు స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులను ఆశ్రయించి కోరుకున్న స్థానాలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని డబ్బు సంపాదించే యోచనలో కూటమి నేతలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్స్

మార్కాపురం: చెన్నైలోని మౌంట్ ఫోర్టు ఇండోర్ స్టేడియంలో మూడో సౌత్‌జోన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో మార్కాపురం పట్టణానికి చెందిన ఎమ్ఎస్ స్పోర్ట్స్ కరాటే స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. రెండు గోల్డ్, నాలుగు బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు కరాటే చీఫ్ ఎగ్జామినర్ ఎం. శ్రీనివాసరెడ్డి, ట్రైనర్ తోట ప్రసాద్ ఆదివారం తెలిపారు. అండర్-9 లో 30 కిలోల విభాగంలో కె. మహితా రెడ్డి గోల్డ్ మెడల్, 50 కిలోల కేటగిరీలో కటా విభాగంలో బ్రాంజ్ మెడల్ జె. భార్గవ గోల్డు మెడల్‌సాధించినట్లు తెలిపారు. సాయిత్రిష, ఎస్.కె షాకీర్ బాషా, యాసీన్ బాషాలు బ్రాంజ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. వీరిని రాష్ట్ర కరాటే అసోసియేషన్ సెక్రటరీ కె. కీర్తన, జిల్లా సెక్రటరీ నల్లూరి మోహన్‌రావు అభినందించారు.



గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు



సాయం సంధ్యవేళలో కంభం చెరువు



కంభం చెరువు కట్టపై జనసందడి

కోలాహలంగా తేరాతేజీ

- తేరాతేజి వేడుకలతో చారిత్రక కంభం చెరువుపై జనసందడి
- పెళ్లి నాటి దండలు చెరువులో వదిలి మొక్కులు తీర్చుకున్న కొత్తజంటలు
- కుటుంబ సభ్యులతో కంభం చెరువుపై సరదాగా గడిపిన ప్రజలు

కంభం: ఆసియాలోనే రెండో అతిపెద్దదైన కంభం చెరువుకట్టపై తేరాతేజి (గరిక తొక్కుడు) పండుగను పురస్కరించుకొని ఆదివారం సందడి నెలకొంది. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాక ఇతర జిల్లాల నుంచి ముస్లింలు కుటుంబ సమేతంగా కంభం చెరువుకు చేరుకున్నారు. నూతన వధూవరులు కంభం చెరువులో పెళ్లినాటి దండలు వదిలి తమ మొక్కులు తీర్చుకొని సరదాగా గడిపారు. ఇంటి వద్ద తయారు చేసుకున్న వంటకాలు పిల్లపాపలతో కలసి కట్టపై, చెరువుకట్ట మార్గం వెంట ఉన్న పంటపొలాల్లో సైతం పలువురు కూర్చొని సహపంక్తి భోజనాలు చేశారు.



చెరువులో పెళ్లినాటి దండలు వదులుతున్న నూతన జంటలు

కట్టపై ఉన్న దీనాషావలి దర్గా వద్ద కొబ్బరి కాయలు, బూంది సమర్పించి ప్రజలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కంభం ఇన్‌చార్జ్ సీఐ జే రామకోటయ్య ఆధ్వర్యంలో కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట ఎస్సైలు పులిరాజేష్, నరసింహారావు, అనిత, 70 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. సాయంత్రం సూర్యాస్తమయ సమయంలో కంభం చెరువు అందాలు కనువిందు చేస్తున్నాయి. చెరువు మధ్యలో కొండలపై నుంచి సూర్యుడి కిరణాలు పడుతూ ఆ అందాలు చూపరులను ఆకట్టుకున్నాయి. పలువురు ఆ సుందర దృశ్యాన్ని సెల్‌ఫోన్‌లతో బంధించారు.



దుకాణాల వద్ద జనాల రద్దీ



చెరువు మెట్లపై సందర్శకుల కోలాహలం



దీనాషావలి దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న భక్తులు

21 మందికి పోస్టింగులు..
10 మందికి వీఆర్

జిల్లాలో ఎస్ఐల బదిలీ

ఒంగోలు టౌన్: పోలీసు శాఖలో బదిలీల పర్వం మొదలైంది. కూటమి ప్రభుత్వ వచ్చీ రాగానే అప్పట్లో పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐలందరినీ బదిలీ చేస్తామంటూ కొందరు ప్రజాప్రతినిధులు ప్రకటించారు. ఇందులో భాగంగానే రెండు రోజుల క్రితం ఆరుగురు ఎస్ఐలపై వీఆర్ వేటు పడింది. ఆదివారం తాజాగా మరో 10 మంది ఎస్ఐలను వీఆర్‌కు పంపించి 21 మందికి పోస్టింగులు ఇచ్చారు. తాజా ఉత్తర్వుల ప్రకారం పోస్టింగులు పొందిన ఎస్ఐల వివరాలు ఇలా ఉన్నాయి. తాళ్లూరు ఎస్ఐ కె.విజయకుమార్‌ను దొనకొండ పీఎస్కు, మద్దిపూడి ఎస్ఐ సీహెచ్.శివ బసవరాజును త్రిపురాంతకం, పామూరు ఎస్ఐ ఎం.సైదాబాబును మార్కాపురం టౌన్, దోర్నాల ఎస్ఐ పి.అంకమరావును మార్కాపురం రూరల్, పీసీపల్లి ఎస్ఐ టి.రమేష్ బాబును మద్దిపూడి, దర్శి పీఎస్‌లో అటాచ్‌లో ఉన్న ఎం.మురళిని దర్శి పీఎస్‌కు కొనసాగిస్తూ ఎస్పీ ఏఆర్ దామోదర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలు డీటీసీలో విధులు నిర్వహిస్తున్న వై.నాగరాజును ముండ్లమూరు, దిశ ఎస్ఐ వి.నాగమల్లేశ్వరరావును టంగుటూరు, తర్లుపాడు ఎస్ఐ సుధాకర్‌ను కొత్తపట్నం, ఒంగోలు వీఆర్‌లో ఉన్న వి.వేమనను పొదిలి పీఎస్, పుల్లలచెరువు అటాచ్‌లో ఉన్న బి. మహేంద్రను సింగరాయకొండకు బదిలీ చేశారు. టంగుటూరు ఎస్ఐ యు.పున్నారావును జరుగుమల్లి, జిల్లా వీఆర్‌లో ఉన్న ఎస్.మల్లికార్జునరావును తాళ్లూరు, వీఆర్‌లో ఉన్న బి.శివరామయ్యను మద్దిపాడు, బేస్తవారిపేట ఎస్ఐ బి. నరసింహారావును కంభం, వీఆర్‌లో ఉన్న పి.అనిల్ కుమార్‌ను పెద్దారవీడుకు స్థానచలనం కల్పించారు. నెల్లూరు నుంచి ప్రకాశం జిల్లాకు అటాచ్ చేసిన పి.చౌడయ్యను యర్రగొండపాలెం, గుంటూరు నుంచి అటాచ్‌లో వచ్చిన జి.గిరిబాబును పొన్నలూరుకు బదిలీ చేశారు. పల్నాడు నుంచి అటాచ్‌మెంట్‌లో జిల్లాకు వచ్చిన ఎస్ సుమన్‌ను కొండపి, బాపట్ల నుంచి అటాచ్‌లో వచ్చిన ఎస్వీ రవీంద్ర రెడ్డి ని బేస్తవారిపేట, బాపట్ల నుంచి వచ్చిన మరో ఎస్ఐ పి.కోటేశ్వరరావును రాచర్ల పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు.

10 మంది ఎస్ఐలకు వీఆర్:

10 మంది ఎస్ఐలను వీఆర్‌కు పంపించారు. సింగరాయకొండ ఎస్ఐ టి.శ్రీరాం, మద్దిపాడు ఎస్ఐ వి.మహేష్, ముండ్లమూరు ఎస్ఐ వి.ఆంజనేయులు, త్రిపురాంతకం ఎస్ఐ వి.సాంబశివయ్య, పెద్దారవీడు ఎస్ఐ జి.వెంకట సైదులు, కొత్తపట్నం ఎస్ఐ బి.సాంబశివ రావు, మార్కాపురం టౌన్ ఎస్ఐ షేక్ అబ్దుల్ రహమాన్, కొండపి ఎస్ఐ ఎం.కృష్ణ బాజిబాబు, దొనకొండ ఎస్ఐ ఎల్.సంపత్ కుమార్, కంభం ఎస్ఐ పి.రాజేష్‌లను వీఆర్‌కు పంపించారు.

క్లుప్తంగా

పిడుగుపాటుకు మహిళ దుర్మరణం


సఖినాభి మృతదేహం

త్రిపురాంతకం: పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా పిడుగుపాటుకు మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని దూపాడులో ఆదివారం సాయంత్రం జరిగింది. వివరాల్లోకి వెళితే.. దూపాడు వద్ద అల్లుడికి చెందిన బత్తాయి తోటలో కుటుంబసభ్యులతో కలిసి కాయలు కోసేందుకు షేక్ సఖినాభి (60) వెళ్లింది. అయితే ఆ సమయంలో ఉరుములు మెరుపులతో చిన్నపాటి వర్షం ప్రారంభమవడంతో ఇంటికి వెళదామనుకుంటున్న సమయంలో పిడుగుపడి సఖీనాభి మృతి చెందగా, కుటుంబసభ్యులు షాక్ గురయ్యారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

ఆటో నుంచి జారిపడి మహిళ మృతి


మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

త్రిపురాంతకం: ఆటో నుంచి జారిపడి మహిళ మృతి చెందింది. ఈ సంఘటన ఆదివారం సాంయంత్ర జరిగింది.వివరాల్లోకి వెళితే.. దొనకొండ మండలం రామాపురం గ్రామానికి చెందిన పి.కాశమ్మ త్రిపురాంతకం ఆలయం వద్ద వివాహానికి హాజరయ్యేందుకు వెళుతుండగా త్రిపురాంతకం – యర్రగొండపాలెం రోడ్డులో త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయాల సమీపంలో ఆటో డోర్ తాడు తెగిపోవడంతో కిందపడి మృతి చెందింది. దీంతో వివాహ వేడుకల్లో విషాదఛాయలు అలముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతానికి యువకుడు మృతి


రవి మృతదేహం

బేస్తవారిపేట: మండలంలోని సింగరపల్లెలో విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన సంఘటన ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన నారు రవి (20) ఎప్పటిలాగే మేకలు తోలుకొని గ్రామం సమీపంలోనే తూర్పువాగు పై ఎత్తులోని పొలాల్లోకి వెళ్లాడు. ఓ రైతు తన పొలం చుట్టూ ఇనుప కంచెను ఏర్పాటు చేసుకొన్నాడు. ఇనుప కంచెకు విద్యుత్ స్టార్టర్ పెట్టాడు. స్టార్టర్ పెట్టెలోని తీగ తెగి ఇనుప కంచెను తగలడంతో ఇనుప కంచె మొత్తానికి విద్యుత్ సరఫరా జరిగింది. ఇది గమనించని రవి ఇనుప కంచెను పట్టుకోవడంతో విద్యుత్ ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనలో రెండు మేకలు కూడా మృత్యువాత పడ్డాయి. రవి సాయంత్రానికి కూడా ఇంటికి రాకపోవడంతో అన్నదమ్ములు వెతుక్కుంటూ పొలాల్లోకి వెళ్లారు. పొలంలో ఇనుపకంచెను తగిలి విగత జీవిగా పడి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తల్లిదండ్రులు సోమయ్య రామలక్ష్మమ్మ మూడేళ్ల కిందట మృతి చెందారు. ముగ్గురు అన్నదమ్ములు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎస్సై నరసింహారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

మార్కాపురంరూరల్: మండలంలోని నికరంపల్లి జాతీయ రహదారిపై ఎదురెదురుగా వస్తున్న రెండు వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం మధ్యాహ్నం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం శ్రీశైలం నుంచి తిరుపతి వెళ్తున్న ఎర్టీగా కారు, బ్రహ్మంగారి మఠం నుంచి శ్రీశైలం వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొనడంతో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ బోర్ల విద్యుత్ తీగలు చోరీ

రాచర్ల: బోర్లకు అమర్చిన విద్యుత్ తీగలను గుర్తు తెలియని దుండగులు చోరీ చేసిన సంఘటన మండలంలోని అనుమలవీడులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..అనుమలవీడు గ్రామానికి చెందిన దూదేకుల మౌలాపీరా, కొండా రామసుబ్బారెడ్డి, పాలుగుళ్ల పెద్దిరెడ్డి, శనిగ నాగయ్య, రేగలగడ్డ బాలయ్య, తంగెళ్ల అనే రైతులకు సంబంధించిన వ్యవసాయ బోర్లకు అమర్చిన విద్యుత్ తీగలను శనివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. విద్యుత్ తీగలు తరుచూచోరీకి గురవుతుండటంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు.

బెల్లంఊట ధ్వంసం

గిద్దలూరు రూరల్: మండలంలోని బురుజుపల్లె గ్రామ శివారులో నాటుసారా తయారీ కోసం నిల్వ ఉంచిన 1200 లీటర్ల బెల్లం ఊటను సెబ్ సీఐ ఎస్. కొండారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ధ్వంసం చేశారు. బురుజుపల్లె గ్రామ శివారులో ఉన్న చెరువుకట్ట సమీపంలో చిల్లచెట్ల మధ్య నాటుసారా తయారు చేస్తున్నారని సమాచారం అందడంతో సీఐ కొండారెడ్డి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని బెల్లం ఊటను ధ్వంసం చేసి 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా తయారీదారులు అక్కడి నుంచి పరారయ్యారు.

వలస సోయగం





మల్లవరం గుండ్లకమ్మ డ్యామ్ వద్ద వలస పక్షులు సందడి చేస్తున్నాయి. పరిసర ప్రాంతాల్లోని పంట పొలాల్లో గింజలు, గుండ్లకమ్మ నదిలోని చేపలను తింటూ అక్కడి చెట్లపై సేద తీరుతున్నాయి. జిల్లాలోని మంచి నీటి చెరువులు ఉన్న గ్రామాలకు వలస వచ్చిన ఈ పక్షులు అక్కడి చెట్లపై గూళ్లు కట్టుకుని పిల్లలను పెట్టి తిరిగి వెళ్తాయి. ఈ పక్షుల విహారం చూస్తున్న ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పక్షులను ఎవరూ వేటాడకుండా చూసుకుంటూ స్థానికులు సంరక్షించుకుంటున్నారు.

- ఎం.ప్రసాద్, సాక్షి ఫొటోగ్రాఫర్







కూలీలతో వెళుతున్న ఆటో బోల్తా


ఆసుపత్రిలో క్షతగాత్రులు

- ఐదుగురికి గాయాలు

దర్శి: కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తా పడి ఐదుగురికి గాయాలు కాగా మరో పది మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని రాజంపల్లి నుంచి రామచంద్రాపురం వెళ్లే రోడ్డులో ఆదివారం జరిగింది. గాయాలైన ఐదుమందికి దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా వారిలో తీవ్రగాయాలైన చేరెడ్డి నాగేంద్రం, మేడి బోయిన అంజమ్మ అనే ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. వివరాల్లోకి వెళితే.. జముకులదిన్నె గ్రామానికి చెందిన 24 మంది కూలీలు కొనకనమిట్ల మండలం మునగపాడుకు కూలి పనుల కోసం వెళుతున్నారు. రాజంపల్లి దాటి రామచంద్రాపురం దగ్గర్లో ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కన


క్షతగాత్రులను చూసేందుకు వచ్చిన గ్రామస్తులు

బోల్తా పడింది. ప్రమాదంలో ఆటోలో ఉన్న వారంతా కిందపడిపోయారు. కొందరు ఆటోలోనే ఇరుక్కుపోగా మరికొంత మంది పక్కకు పడిపోయారు. ఆటో పూర్తిగా దెబ్బతింది.


బోల్తాపడిన ఆటో

ట్రాక్టర్ రోప్‌లోకి వెళ్లడంతో ఆటోకు పెద్ద ప్రమాదం తప్పింది. రోడ్డు నుంచి నేరుగా కింద పడిపోయి ఉంటే గుంతలో పడి పెద్ద ప్రమాదం జరిగేదని ఆటోలోని వారు ఊపిరి పీల్చుకున్నారు. ఆటోలో 24 మందిని సర్దుకొని వెళ్లడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఐరన్ ఫ్యాక్టరీలో చోరీ

- రూ.10 లక్షల విలువైన సామాను అపహరణ

కొమరోలు: మూసివేసిన ఓ ఐరన్ ఫ్యాక్టరీలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వివరాల్లోకి వెళితే.. కొమరోలు మండలంలోని ఇడమకల్లు గ్రామసమీపంలో కడప–అమరావతి రాష్ట్రీయ రహదారి పక్కన ఉన్న శ్రీలక్ష్మీనారాయణ ఐరన్ ఇండస్ట్రీస్‌ను ఈ నెల ఒకటి నుంచి మూసివేశారు. శనివారం అర్ధరాత్రి సమయంలో వాచ్‌మన్ సెలవులో ఉండడాన్ని గమనించిన దొంగలు ఫ్యాక్టరీలోకి చొరబడి రూ.10 లక్షల విలువైన సామాన్లను ఎత్తుకెళ్లినట్లు యజమాని తుమ్మలపెంట వెంకటరమణ తెలిపారు. ఫ్యాక్టరీలో ఉన్న 17 మోటార్లు, 2 ఎల్ఈడీ టీవీలు, 15 బస్తాల మేకులు, ట్రాన్స్‌ఫార్మర్‌లోని


రాగి తీగ చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్

రాగి తీగ చోరీ చేశారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో వెంకటరమణ ఫిర్యాదు చేయగా ఎస్సై మధుసూదన్‌రావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మార్కాపురం నుంచి క్లూస్ టీమ్ చోరీ జరిగిన ప్రదేశంలో ఆధారాలు సేకరించారు.

నల్లమల రోడ్డులో ట్రాఫిక్‌జామ్

- రోడ్డుకు అడ్డంగా నిలిచిన లోడు లారీ
- కర్నూల్, గుంటూరు రోడ్డులో గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం

పెద్దదోర్నాల: ఓ లోడు లారీ మరమ్మతులకు గురై రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు గంటపాటు అంతరాయం కలిగింది. ఈ సంఘటన మండల పరిధిలోని కర్నూల్–గుంటూరు రహదారిలోని పిల్లల ఘాట్ వద్ద ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఆదివారం మధ్యాహ్నం 11 గంటల సమయంలో కర్నూలు నుంచి లోడుతో వస్తున్న లారీ మరమ్మతులకు గురై రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. దీంతో ఎదురుగా వెళ్లే వాహనాలకు దారి లేకపోవటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గంట పాటు


రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయిన లోడు లారీ

వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు స్వచ్ఛందంగా ట్రాఫిక్‌ను నియంత్రించి రోడ్డుకు అడ్డంగా నిలిచిన లారీని తొలగించారు. దీంతో ట్రాఫిక్‌లో చిక్కుకున్న ప్రయాణికులు బతుకు జీవుడా అంటూ ఊపిరి పీల్చుకున్నారు.

గేదె అడ్డు రావడంతో..

- అదుపుతప్పి టెంపో ట్రావెల్ బస్సు బోల్తా..


బోల్తాపడిన వాహనాన్ని పరిశీలిస్తున్న ఎస్సై


గాయపడిన వారికి 108 వాహనంలో చికిత్స

కొనకనమిట్ల: దైవ దర్శనం చేసుకుని తిరిగి సొంతూరికి వెళుతుండగా వాహనానికి గేదె అడ్డురావడంతో అదుపు తప్పి వాహనం బోల్తా పడింది. ఈ సంఘటన ఆదివారం రాత్రి 565 జాతీయ రహదారి మండలంలోని చేరెడ్డివారిపల్లి వద్ద జరిగింది. వివరాల్లోకి వెళితే..హైదరాబాద్ ఘూట్‌కేసరికి చెందిన 10 మంది భక్తులు టెంపో ట్రావెల్ మినీ బస్సులో భైరవకోన ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకుని తిరిగి హైదరాబాద్ వెళుతున్నారు. ఈ క్రమంలో టెంపో వాహనం చేరెడ్డివారిపల్లి సమీపంలోకి రాగానే రోడ్డుపైకి గేదెలు అడ్డువచ్చాయి. గేదెలను తప్పించే క్రమంలో వాహనం పక్కకు వరిగి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కొనకనమిట్ల ఎస్సై మాధవరావు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. గాయపడిన వారిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

దద్దాల మానవత్వం

కనిగిరి రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు తక్షణ సేవలు చేయడమే కాకుండా వారిని ఆస్పత్రిలో చేర్పించి వైఎస్సార్ సీపీ కనిగిరి ని ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ మానవత్వం చాటుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన భక్తులు సీఎస్‌పురం మండలం భైరవ కొన దైవ దర్శనానికి వచ్చి తిరిగి వెళ్తున్నారు. మార్గమధ్యంలో వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. అప్పుడే అటుగా వెళ్తున్న దద్దాల నారాయణ యాదవ్ తన కాన్వాయ్‌ను ఆపి, ప్రమాదంలోగాయపడిన క్షతగాత్రులకుసహాయకచర్యలుఅందించిఆస్పత్రికి తరలించారు.



అన్నా చెల్లెళ్ల అనుబంధం

అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ పౌర్ణమి నిలుస్తుంది. సోమవారం రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని దుకాణాలన్నీ రాఖీ కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

సాక్షి, ఒంగోలు


రాఖీ కొనుగోలుదారులతో దుకాణాలు కిటకిట